సాక్షి తిరుపతి

శుక్రవారం ¦ 11 ¦ ఏప్రిల్ ¦ 2025



ట్రాఫిక్‌కు అంతరాయం

ఒంటిమిట్టలో శుక్రవారం సీఎం పర్యటన సందర్భంగా పోలీసులు ట్రయల్‌రన్ నిర్వహించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారు. - 8లో



పలు కోర్సులకు మంగళం

తిరుపతి ఎస్వీయూలో పలు కోర్సులకు మంగళం పాడేశారు. దీనిపై విద్యార్థి సంఘాల నాయకులు రగిలిపోతున్నారు. - 8లో



నేత్రపర్వంగా స్నపన తిరుమంజనం

రాపూరులోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామికి గురువారం స్నపన తిరుమంజనాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

కంగ్రాట్స్ రామ్

- వెంకటగిరి మున్సిపాలిటీ విజయంపై నేదురుమల్లికి జగన్ అభినందన



నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని అభినందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం): 'కంగ్రాట్స్ రామ్.. వెంకటగిరి మున్సిపల్ కౌన్సిల్ అవిశ్వాస తీర్మానంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంలో నీ పాత్ర కీలకం' అంటూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెచ్చుకున్నారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో గురువారం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కలిశారు. బుధవారం వెంకటగిరిలో జరిగిన అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన విశేషాలను జగన్‌కు వివరించారు. టీడీపీ కుట్రలను ఎదుర్కొని అవిశ్వాస తీర్మానంలో నెగ్గడం రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతుందని ఆయన కొనియాడారు. త్వరలోనే మున్సిపల్ చైర్మన్‌తోపాటు 18 మంది కౌన్సిలర్లతో ప్రత్యేక అభినంద సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వెంటగిరి మున్సిపల్ కౌన్సిల్ అవిశ్వాస తీర్మానంలో నెగ్గి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతికిగా అందించినట్లు పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి సలహాలివ్వండి



వర్క్‌షాపులో సలహాలు, సూచనలు వింటున్న కలెక్టర్, జేసీ, డీఆర్వో

తిరుపతి అర్బన్: జిల్లాలో రెవెన్యూ సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ క్రమంలో సీసీఎల్ ఆదేశాల మేరకు రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, గూడూరు ఆర్డీవో రాఘవేంద్ర మీనా ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించారు. జిల్లాలో పది నెలల కాలంలో 37వేల అర్జీలు వచ్చాయి. అందులో 25వేల అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే ఉన్నాయి. వీటిని పరిష్కరించేందుకు నిపుణుల నుంచి సలహాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రోజ్‌మాండ్, సుధారాణి, తిరుపతి ఆర్డీవో రామమోహన్, శ్రీకాళహస్తి ఆర్డీవో పాల్గొన్నారు.

తెప్పోత్సాహం



తిరుపతిలోని శ్రీకోదండరామస్వామి తెప్పోత్సవాలు గురువారం శ్రీరామచంద్ర పుష్కరిణిలో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం శ్రీసీతా లక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు తెప్పోత్సవం చేపట్టారు. ఆలయ డెప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు. - తిరుపతి కల్చరల్

వసంత వైభవం!

తిరుమల శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామికి స్నపన తిరుమంజనాన్ని వేడుకగా నిర్వహించారు. ఒక్కో క్రతువులో ఒక్కో రకమైన ఉత్తమ జాతి పుష్ప మాలలను స్వామి, అమ్మవార్లకు నివేదించారు. అనంతరం శ్రీవారు తమ దేవేరులతో కలిసి తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. - తిరుమల



స్వామివారికి గొడుగు పడుతున్న అర్చకులు

పేదలపై గుదిబండ!



'సంపద సృష్టిస్తాం.. సామాన్యులను కోటీశ్వరులను చేస్తాం. నిత్యావసర ధరలను అదుపు చేస్తాం. నిరుద్యోగ సమస్యను రూపుమాపుతాం. సూపర్ సిక్స్‌తో సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తాం. మహిళలను మహారాణులు తీర్చిదిద్దుతాం'. అంటూ ఎన్నికల సందర్భంగా కూటమి నేతలు ప్రగల్భాలు పలికారు. వీరి మాటలు విని అమాయక ప్రజలు ఓట్లు వేసి అందలమెక్కించారు. గద్దెనెక్కిన తర్వాత నేతలు తమ విశ్వరూపాన్ని చూపిస్తున్నారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ అమలు చేయకపోగా.. కేంద్ర ప్రభుత్వం ఇబ్బడిముబ్బడిగా ధరలు పెంచేస్తూ సామాన్యుల నడ్డివిరవడం విమర్శలకు తావిస్తోంది. తాజాగా వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.50 అదనపు భారం వేయడం పేదలకు గుదిబండగా మారింది.



సిలిండర్‌పై అదనంగా రూ.50 మోత

- ఇబ్బడిముబ్బడిగా ధరలు పెంచేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- అయోమయంలో పేద ప్రజలు
- పట్టించుకోని కూటమి నేతలు

తిరుపతి అర్బన్: కూటమి ప్రభుత్వం పేదల నెత్తిన 'బండ' వేసింది. నిత్యావసర సరుకులతోపాటు నూనె ధరలు విపరీతంగా పెంచేసింది. మరో వైపు పెట్రోల్, డీజిల్ ధరలనూ అధికం చేసింది. ఇవి చాలదన్నట్టు ఇప్పుడు గృహ వినియోగదారుల గ్యాస్ లిండర్‌పై అదనంగా రూ.50 మోపింది. దీని కారణంగా జిల్లాలో ఏడాదికి రూ.3 కోట్లమేర అదనపు భారం పడనుంది. పేద, మధ్యతరగతి ప్రజలకు గుదిబండగా మారింది.

ఏడాదికి రూ.450 వరకు అదనం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సామాన్య ప్రజలు కోలుకోలేకపోతున్నారు. ఏది కొనాలన్నా మండిపోతున్నాయి. ఇటీవల నూనె ధరలు లీటర్‌పై రూ.20 వరకు పెంచేశారు. ఇప్పుడు సిలిండర్‌పై అదనంగా రూ.50 వరకు వడ్డించారు. పేదవాడు ఏడాదికి 8 నుంచి 9 సిలిండర్లు వినియోగిస్తాడు. అంటే ఏడాదికి రూ.400 నుంచి రూ.450 అదనపు భారం మోయనున్నాడు.



జిల్లా సమాచారం	
గ్యాస్ ఏజెన్సీలు	41
గ్యాస్ కనెక్షన్లు	4,92,404
14.2 కిలోల సిలిండర్ ధర	844.50
అదనంగా పెంచింది	50

అన్ని ధరలు పెంచేస్తున్నారు



కూటమి ప్రభుత్వం వచ్చాక నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పది నెలలు గడుస్తున్నా ఒక్కటంటే ఒక్క సంక్షేమ పథకాన్ని అమలు చేయలేదు. ధరలు మాత్రం ఇబ్బడిమొబ్బడిగా పెంచేస్తున్నారు. జీవనం కష్టంగా మారుతోంది.

– రత్నకుమారి, తిరుపతి

ఖర్చులు పెరుగుతున్నాయి



ఆదాయం తగ్గుతోంది. ఖర్చులేమో పెరిగిపోతున్నాయి. ఓ వైపు కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయాయి. ఇటీవల వరిధాన్యం దిగుబడి తగ్గిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో గ్యాస్ ధరలు పెంచడం మంచి పద్ధతి కాదు.

– కృష్ణయ్య, ఏర్పేడు

గ్యాస్ ధరలు తగ్గించాలి



పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి. ఒక్కొక్కటిగా అన్నింటినీ పెంచుకుంటూ పోతే ఎలా బతకాలి. ఇటీవల పెద్ద ఎత్తున నూనె ధరలు పెంచేశారు. దీంతో లీటర్‌పై రూ.20 నుంచి రూ.30 వరకు అదనంగా పెరిగిపోయింది. మరోవైపు కరెంట్ చార్జీలు పెంచేశారు. ఇప్పుడు కొత్తగా గ్యాస్ ధరలు పెంచడం భావ్యం కాదు.

– చంద్రకళ, నాయుడుపేట

చంద్రగిరిలో గాలీవాన



భారీ వర్షం

చంద్రగిరి: చంద్రగిరిలో గురువారం సాయంత్రం 4 గంటలకు అకస్మాత్తుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. భీకరమైన పెనుగాలులు వీచాయి. ఆ వెంటనే చిన్నపాటి చినుకులతో ప్రారంభమై భారీ వర్షం కురిసింది. ఓ వైపు ఈదురుగాలులు.. మరో వైపు ఉరుముల శబ్దాలు స్థానికులను ఉక్కిరిబిక్కిరి చేశాయి. పెనుగాలుల ధాటికి పట్టణంలోని కొత్తపేటలో ఓ భారీ చింత చెట్టు కూలిపోయింది. విద్యుత్ స్తంభం వంగిపోయింది. కేవలం 30 నిమిషాల పాటు బీభత్సం సృష్టించింది.



చంద్రగిరి కొత్తపేటలో నేలకూలిన భారీ వృక్షం, విద్యుత్ స్తంభం

విఫలరాజేనా?



మామిడి.. పండ్లలో రారాజు. మాధుర్యం..చక్కటి రుచి, సువాసనలో సాటిలేనిది చిత్తూరు మామిడి. జిల్లాలో పండే ఈ పంట ప్రపంచంలోనే పేరుగాంచింది. అందుకే ఇక్కడి మామిడి పలు విదేశాలకు ఎగుమతి.. కర్షకులకు బహుమతిగా ప్రసిద్ధి చెందింది. అయితే ప్రస్తుత అమెరికా అధ్యక్షుడి పన్నుల విధానం .. స్థానిక పల్ప్ ఫ్యాక్టరీల నిర్వాహకులు సిండికేట్‌తో ధరలు పతనం తప్పదా? అన్న సందిగ్ధం నెలకొంది. ఈ క్రమంలో మన మామిడి వి'ఫల'రాజుగా మిగిలేనా? లేక రాణించేనా? అన్న మీమాంస రైతుల్లో నెలకొంది. శుక్రవారం జరగనున్న ఉద్యానవన సదస్సులో ఏ మి జరుగుతుందో వేచి చూడాల్సి ఉంది.

- మామిడి ఎగుమతులపై 26 శాతం పన్ను విధించిన అమెరికా
- భారీగా తగ్గనున్న మామిడి ఎగుమతులు
- ఫలితంగా ఢీలా పడనున్న మామిడి ధరలు
- నేడు చిత్తూరులో మామిడి వ్యాపారులు, రైతులతో హార్టికల్చర్ కాన్‌క్లేవ్

పలమనేరు : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని రైతులకు ప్రధాన ఆధారం మామిడి. ఇక్కడ 70 శాతం తోతాపురి తోటలున్నాయి. జిల్లాలోని మామిడి ఉత్పత్తుల్లో 60 శాతం మ్యాంగో పల్ప్ పరిశ్రమలకు వెళ్లగా 20 శాతం దాకా టేబుల్ వెరైటీలు విదేశాలకు ఏటా ఎగుమతి అవుతున్నాయి. ఈ ఎగుమతులపై గతంలో మామిడిపై కేవలం 5 శాతం మాత్రమే పన్నులుండేవి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న అధిక పన్నుల కారణంగా చిత్తూరు జిల్లా నుంచి ఎగుమతి అయ్యే మామిడిపై 26 శాతం పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. ఇకపై ఇక్కడి నుంచి ఎగుమతి అయ్యే 2.50 లక్షల టన్నుల మామిడిపై అధిక పన్ను ప్రభావం పడనుంది. గతేడాది సీజన్‌లో టన్ను రూ.28 వేలు వరకు ఉన్న ధరలు అమాంతం తగ్గుముఖం పట్టి టన్ను రూ.21 వేలకు చేరింది. దీంతో మామిడి రైతులకు గతేడాది నష్టాలు తప్ప లేదు. ఏటా సీజన్‌లో పల్ప్ యాజమాన్యాలు సిండికేట్ అయి ధరలను నియంత్రిస్తున్నట్లు మామిడి రైతులు ఆరోపిస్తున్నారు.

గతంలో అమెరికా పన్ను కేవలం 5 శాతమే..

జిల్లా నుంచి టేబుల్ రకాల మామిడి అమెరికాతో



ఏటా అమెరికాకు ఎగుమతి అవుతున్న బేనిషా రకం

పాటు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సౌత్ ఆఫ్రికా, బెహరైన్, నేపాల్, యూఏఈ దేశాలకు ఎగుమతులు జరిగేవి. ఎక్కువ శాతం యూఎస్‌ఏకు వెళ్లేది. గతంలో మామిడిపై పన్ను కేవలం 5 శాతం మాత్రమే ఉండేది. కానీ ట్రంప్ గద్దెనెక్కాక పన్నులను 26 శాతానికి పెంచేశారు. భారీగా పెరిగిన పన్నులు మామిడి ఎగుమతులపై తీవ్ర ప్రభావాన్ని చూపడం ఖాయంగా కనిపిస్తోంది. ఎగుమతి పన్ను పెరిగినందున ఇక్కడి వ్యాపారులు స్థానిక మామిడి తక్కువ ధరకు కొనాల్సి వస్తుంది. దీంతో మామిడి రైతులకు నష్టాలు తప్పేలాలేవు.

ఇతర దేశాలపై దృష్టి సారించాలి

ఏటా ఇక్కడి నుంచి మామిడిని ఎగుమతి చేసే పలు దేశాల్లో పన్నులు తక్కువగా ఉన్న దేశాలకు ఎగుమతులను పెంచేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. మరోవైపు అమెరికాకు ప్రత్యామ్నాయంగా మారుతుంది.

పల్ప్ ఫ్యాక్టరీల సిండికేట్ దెబ్బ

జిల్లాతో పాటు పొరుగు రాష్ట్రాల్లో 30 దాకా మామిడి గుజ్జు పరిశ్రమలున్నాయి. ఇక్కడ పండిన పంటలో 50 శాతం జిల్లాతో పాటు పొరుగు రాష్ట్రాల్లోని జ్యూస్ ఫ్యాక్టరీలకు చేరుతుంది. మామిడి కాయలను పల్ప్ (మామిడి గుజ్జు) తయారు చేసి, ఇతర రాష్ట్రాలకే కాక విదేశాలకు సైతం ఎగుమతులు చేస్తుంటారు. ఏటా జూన్ తొలివారం నుంచి జులై తొలి వారం వరకు తోతాపురి సీజన్ ముగుస్తుంది. ఆపై ఆగస్టు తొలి వారం వరకు నీలం లాంటి టేబుల్ రకాలతో ఇక్కడి సీజన్ అయిపోతుంది. అయితే ఏటా జిల్లాతో పాటు పొరుగు రాష్ట్రాల పల్ప్ పరిశ్రమలు సైతం సిండికేట్‌గా మారి ధరలను తగ్గిస్తున్న విషయం ఏటా జరుగుతూనే ఉంది. దీంతో తోతాపురి రైతులకు ఏటా పండించిన మామిడికి గిట్టుబాటు దక్కకుండా పోతోంది.

నేడు చిత్తూరులో ఉద్యానవన సదస్సు

అమెరికా పన్నులు పెంచిన నేపథ్యం, స్థానికంగా పల్ప్ ఫ్యాక్టరీల సిండికేట్ వ్యవహారంపై నేడు జిల్లా కేంద్రంలో జరగనున్న ఉద్యానవన సదస్సుకు కలెక్టర్, హార్టికల్చర్ శాఖ, చీఫ్ సెక్రటరీ, డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్‌తో పాటు పలువురు మంత్రులు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, మామిడి రైతులు, వ్యాపారులు, పల్ప్ పరిశ్రమల నిర్వాహకులు హాజరు కానున్నారు.



అధికంగా సాగవుతున్న తోతాపురి రకం మామిడి

మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి



ఇప్పుడున్న పరిస్థితుల్లో మామిడి రైతుకు గిట్టుబాటు ధర టన్ను రూ.30 వేల దాకా ఉండాలి. ఏటా గుజ్జు పరిశ్రమల సిండికేట్‌తో ధరలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. తోతాపురి కాయలు కోతల కొచ్చే సమయంలో ఉన్నట్టుండి ధరలు తగ్గుముఖం పడితే రైతులకు తీవ్ర నష్టం వస్తుంది. దీనిపై ఉన్నతాధికారులు పల్ప్ పరిశ్రమ నిర్వాహకులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలి. – సుబ్రహ్మణ్యంనాయుడు, రామాపురం, పలమనేరు మండలం

శాంతిభద్రతలను కాపాడండి



పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఇచ్చిన రసీదును చూపుతున్న కామిరెడ్డి

పెళ్లకూరు : సంఘ విద్రోహుల నుంచి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సామాజిక సమతుల్యతను కాపాడాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం ఆయన తమ పార్టీ నాయకులతో వెళ్లి పెళ్లకూరు ఎస్‌ఐ నాగరాజుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోను మార్ఫింగ్ చేసి బూతు పదజాలంతో దుర్భాషలాడుతూ 'రావణ్ మహరాజ్' ఫేస్‌బుక్ ఖాతా ద్వారా సోషల్ మీడియాలో పోస్టు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయం కోసం జిల్లా పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. అవసరమైతే న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బు వెంకటరత్నం, నాయకులు బాలసుబ్రమణ్యం, మోహన్, జితేంద్ర, వీరకుమార్, హరిబాబురెడ్డి, చక్రపాణి, కృష్ణయ్య, కుమారస్వామి, ప్రశాంత్, తిరుపతయ్య, అశోక్, గురవయ్య పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 14 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 62,076 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 23,698 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.27 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ధ్యానంపై అవగాహన



మాస్టర్ ప్రదీప్ విజయ్, కళాశాల అధికారులు, వైద్యులు

తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాల భువన విజయం ఆడిటోరియంలో వైద్య విద్యార్థులకు ధ్యాన శాస్త్రంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ధ్యాన శాస్త్ర నిపుణులు, ఇంటర్నేషనల్ స్పిరిచువల్ సైన్స్ టీచర్ ఫౌండర్ మాస్టర్ ప్రదీప్ విజయ్ హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ధ్యానం జపం కాదు, ప్రార్థన అంతకంటే కాదని, శ్వాస శక్తి మాత్రమేనని తెలిపారు. వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రైవేటుగా ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ప్రైవేటుగా చేరదలచిన వారు ఈ నెల 7 నుంచి 12వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ వీ.లక్ష్మి తెలిపారు. ఇదివరకు ఐటీఐ పాసై మరో కోర్సులో చేరడానికి, ఐటీఐలో సీఓఈ పాసైన వారు, ఎస్‌సీవీటీ పాసైన వారు, వివిధ అప్రెంటీస్ యాక్ట్ కింద పరిశ్రమల్లో, ప్రభుత్వ సంస్థల్లో టెక్నికల్ మూడేళ్లు పనిచేసే వారు ప్రైవేటుగా దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 85000 21856, 91777 01082 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

క్లుప్తంగా

తిరువణ్ణామలైకి 81 సర్వీసులు

తిరుపతి అర్బన్: పౌర్ణమి సందర్భంగా జిల్లా నుంచి తిరువణ్ణామలైకి ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసినట్టు డీపీటీఓ నరసింహులు గురువారం తెలిపారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు జిల్లాలోని 11 డిపోల నుంచి 81 ప్రత్యేక సరీ్వసులను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ప్రధానంగా 3 ఏసీ సర్వీసులు, 11 సూపర్‌లగ్జరీ సర్వీసులు, 11 అల్ట్రాడీలక్స్ సర్వీసులు, 32 ఎక్స్‌ప్రెస్‌లు, 24 సప్తగిరి సర్వీసులను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతి చెందిన సుబ్రమణి


తడ: జాతీయ రహదారిపై కారూరు పంచాయతీ, కారూరుమిట్ట గ్రామం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తమిళనాడులోని రెడ్ హిల్స్‌కి చెందిన సుబ్రమణి(50) మృతి చెందాడు. ఎస్ఐ కొండపనాయుడు కథనం.. కారూరు పంచాయతీ, ఖాశింగాడు కుప్పం గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ వద్ద సుబ్రమణి రైల్వే కూలి పనులకోసం వచ్చి అదే గ్రామంలో ఉంటున్నాడు. బుధవారం రాత్రి సరుకులు కొనుగోలు చేసేందుకు బయటకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో రోడ్డు దాటుతుండగా చెన్నై నుంచి సూళ్లూరుపేట వైపు వెళుతున్న టెంపో ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్రమణి అక్కడికక్కడే మృతిచెందాడు. గురువారం పంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

పలు కోర్సులకు మంగళం

- ఎస్వీయూలో పలు సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సులు ఇక కనబడవు
- పీజీ సెట్‌లో కానరాని ఆరు ప్రధాన కోర్సులు
- ఆవేదన చెందుతున్న విద్యార్థులు

తొలగించిన పీజీ సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సులు

1. ఎంకామ్ (ఎఫ్ఎమ్)
2. ఎంఏ ఎకనామిక్స్
3. ఏంఏ తెలుగు
4. ఏంఏ సోషియల్ వర్క్
5. ఎమ్మెస్సీ ఎలక్ట్రానిక్స్
6. ఎమ్మెస్సీ అనిమల్ బయోటెక్నాలజీ



ఎస్వీయూ పరిపాలనా భవనం

తిరుపతి సిటీ: అనుకున్నట్టే జరిగింది. ఎస్వీయూలో నూతన కోర్సులు దేవుడెరుగు.. ఉన్న కోర్సులకు మంగళం పాడేస్తున్నారు. ఏపీ పీజీ సెట్‌లో పలు సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సులను తీసేశారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆ కోర్సులకు ఆప్షన్ పెట్టుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. ఏపీ పీజీ సెట్ నుంచి ఎస్వీయూలో ప్రస్తుతం కొనసాగుతున్న ఆరు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను 2025–26 విద్యాసంవత్సరం నుంచి తొలగించినట్లు వీసీ అధికారికంగా ప్రకటించారు.

అధ్యాపకులు రోడ్డు పాలు!

కోర్సుల నిర్వహణ వర్సిటీకి భారంగా మారిందని అధికారులు చెబుతున్న కుంటి సాకులను విద్యార్థి సంఘాల నాయకులు కొట్టిపారేస్తున్నారు. ఎంతో మంది విద్యార్థులు పీజీ సెట్‌లో అనుకున్న కోర్సులో సీటు సాధించలేని పక్షంలో సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సులను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. అటువంటి విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లడం దారుణమని మండిపడుతున్నారు. కోర్సుల్లో ప్రవేశాలను పెంచేందుకు అధికారులు కృషి చేయాలి తప్ప పేదలు ఎక్కువగా చదివే పీజీ కోర్సులను తొలగించడం సమంజసం కాదనిఅంటున్నారు. వర్సిటీలో పనిచేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్లను వర్సిటీ నుంచి గెంటివేసి రోడ్డు పాలు చేసేందుకు అధికారులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఏ, పీడీఎస్ఓ విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.

ఆదరణ లేక ఆపేస్తున్నాం

“ఎస్వీయూలో ఆదరణలేని పలు సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సులను ఏపీ పీజీసెట్–2025 నుంచి తొలగించాం. ఏపీ పీజీసెట్–2025కు దరఖాస్తుల ప్రక్రియ ఈనెల 2 నుంచి ప్రారంభమైంది. ఇప్పటికే 3,373 దరఖాస్తులు అందాయి. మే 5వ తేదీ వరకు తుది గడువు ఉంది. ఎస్వీయూలో గత కొన్నేళ్లుగా 30శాతం లోపు అడ్మిషన్లు ఉన్న పలు కోర్సులను గుర్తించాం. ఇందులో ఆరు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులలో విద్యార్థులు చేరేందుకు సుముఖత వ్యక్తం చేయడం లేదు. ఆదరణ లేని ఆ కోర్సులను ఈ ఏడాది పీజీసెట్ నుంచి తొలగించాం. – సీహెచ్ అప్పారావు, వీసీ

విద్యుత్ షాక్‌తో ఎలుగుబంటు మృతి



మృతి చెందిన ఎలుగుబంటు

సాక్షిటాస్క్‌ఫోర్స్: చామలా అటవీ వన్యప్రాణుల అభయారణ్యం (భాకరాపేట అడువులు)లో విద్యుత్ తీగలు తగిలి ఎలుగుబంటు మృతి చెందింది. ఈ ఘటన ఆ ప్రాంతంలో కలకలం రేకేతించింది. వివరాలు.. చిన్నగొట్టిగల్లు మండలం, చిట్టేచెర్ల పంచాయతీ, తుమ్మచేనుపల్లె అటవీ సరిహద్దు ప్రాంతమైన ఎర్రగొండ పెద్దాయన చెరువు సమీపంలో వేటగాళ్లు తీసిన విద్యుత్ తీగలకు ఎలుగుబంటు మృతి చెందినట్లు సమాచారం. ఈ ప్రాంతంలో దాదాపు 3 నుంచి 4 కిలోమీటర్ల మేర విద్యుత్ తీగలు వేటగాళ్లు తీసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై భాకరాపేట అటవీ అధికారులను వివరణ కోరడానికి ప్రయత్నించగా వారు స్పందించలేదు.

డీసీహెచ్‌ఎస్ పరిధిలో పోస్టుల ప్రొవిజనల్ మెరిట్‌లిస్ట్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా వైద్య విధాన పరిషత్(డీసీహెచ్‌ఎస్)లోని పలు పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ లిస్టులను ఆన్‌లైన్‌లో ఉంచినట్లు డీసీహెచ్‌ఎస్ పద్మాంజలిదేవి తెలిపారు. రెండు నెలల కిందట పలు పోస్టుల ఖాళీలను భర్తీ చేయాలన్న ఉద్దేశంతో వైద్యశాఖ నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఈ దరఖాస్తులకు సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్‌లిస్టును గురువారం సాయంత్రం ఆన్‌లైన్‌లో ఉంచామన్నారు. ఈ జాబితా కోసం www.chittoor.ap.gov.inలో చూసుకోవచ్చున్నారు. ఇందులో అభ్యంతరాలుంటే ఈనెల 12వ తేదీలోపు కార్యాలయంలో సమర్పించాలని ఆమె పేర్కొన్నారు.

హరిపురం కాలనీలో దొంగలు హల్‌చల్

- అర్ధరాత్రి వేళ ప్రహరీ గోడ దూకి రెండో అంతస్తుకు వెళ్లిన వైనం
- నిద్రిస్తున్న మహిళ మెడలో బంగారం గొలుసు చోరీ

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, పేరూరు పంచాయతీ, హరిపురం కాలనీలో బుధవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. పెంట్ హౌస్‌లో నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి బంగారం గొలుసును అపహరించుకువెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు... పరకాల కుమార్ కారు డ్రైవర్. పేరూరు పంచాయతీ హరిపురం కాలనీలో రెండు అంతస్తుల ఇల్లు కట్టుకుని గ్రౌండ్ ఫ్లోర్‌ను బయటి వ్యక్తులకు బాడుగకు ఇచ్చాడు. నెల క్రితం వారు ఖాళీ చేసి వెళ్లారు. మొదటి అంతస్తులో కుమార్ తన భార్య, పిల్లలు, తల్లిదండ్రులతో కలసి నివసిస్తున్నాడు. మొదటి అంతస్తుకు పైభాగంలో ఒక పెంట్ హౌస్ ఏర్పాటు చేసుకుని అందులో నిద్రిస్తుంటారు. ఎప్పటి లాగానే బుధవారం రాత్రి కుమార్ తన భార్య శోభతోపాటు 13ఏళ్ల కుమార్తెతో కలసి పెంట్ హౌస్‌కు వెళ్లి పడుకున్నారు. ఉక్కపోత ఎక్కువగా ఉండడంతో పెంట్ హౌస్ తలుపు తెరిచిపెట్టారు. అర్ధరాత్రి 1.30 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు కుమార్ ఇంటి ప్రహరీ గోడ దూకి పెంట్ హౌస్‌లో నిద్రిస్తున్న శోభ మెడలోని బంగారం గొలుసు, మంగళ సూత్రాలతో పాటు వారిద్దరి సెల్‌ఫోన్లను దోచుకెళ్లారు. తెల్లవారు జామున 3 గంటల సమయంలో నిద్రలేచిన శోభ బంగారం గొలుసు కనిపించకపోవడంతో దంపతులు మేడపై నుంచి కిందకు దిగివచ్చి గట్టిగా అరుస్తూ చుట్టు పక్కల వారిని అప్రమత్తం చేశారు. హరిపురం కాలనీకి చెందిన యువకులు చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలించినప్పటికీ దొంగల ఆచూకీ లభించలేదు. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిశీలించారు. అనంతరం చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ ఘటనా స్థలికి చేరుకుని బాధితురాలు, ఆమె భర్తతో పాటు స్థానికులను విచారించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు 30 గ్రాముల బంగారం, రెండు సెల్ ఫోన్లు దొంగతనం జరిగినట్టుగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి మహిళ ఆత్మహత్య

తిరుపతి క్రైమ్: అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం తిరుపతిలో చోటుచేసుకుంది. ఈస్ట్ పోలీసుల కథనం.. కెనడి నగర్‌లోని పద్మావతి అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న వెంకటేష్‌తో రాజంపేటకు చెందిన గౌతమికి వివాహమైంది. వెంకటేష్ మెడికల్ రెప్రజెంటేటివ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం వెంకటేష్ విధులకు వెళ్లాడు. వారి కుమార్తె పాఠశాలకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గౌతమి మూడో అంతస్తు నుంచి కిందకు దూకేసింది. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. అయితే తండ్రి సుబ్బరాయుడు ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. ఇదిలా ఉంటే గౌతమికి గత కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేదని, అందువల్లే ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు ప్రాథమిక విచారణలో నిర్ధారించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించనున్నారు. ఈ మేరకు గురువారం సాయంత్రం రేణిగుంట– కడప రహదారి కరకంబాడి వద్ద కడప వైపు వెళ్లే వాహనాలను పోలీసులు నిలిపేసి ట్రాఫిక్‌ను తిరుపతి వైపు మళ్లించారు. కరకంబాడి వద్ద వాహనాలు పూర్తి స్థాయిలో నిలిచిపోయాయి. రేపు జరిగే సీఎం కార్యక్రమానికి ఇప్పటి నుంచే వాహనాలను నిలిపివేయడం ఏమిటని పలువురు ప్రశ్నించారు. అయితే సీఎం కాన్వాయ్ ట్రయల్ రన్ వల్లే వాహనాలను ఆపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

వాల్మీకి చరిత్ర పుస్తకావిష్కరణ



వాల్మీకి చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ

తిరుపతి సిటీ: ఎస్వీయూ ప్రాచ్య పరిశోధన సంస్థ ముద్రించిన 'వాల్మీకి చరిత్ర' పుస్తకాన్ని గురువారం వీసీ ఆచార్య చిప్పాడ అప్పారావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, విశ్వవిద్యాలయం నిధులతో ప్రాచ్య పరిశోధన సంస్థ రఘునాథ నాయకుడు రాసిన 'వాల్మీకి చరిత్ర'ను ముద్రించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ గ్రంథాన్ని సంస్థ సంచాలకులు ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు వచనంలో భావానువాదం చేశారని తెలిపారు. వాల్మీకి మహర్షిగా మారకముందు ఆయన జీవన సరళిని విపులంగా ఇందులో వివరించారన్నారు. కిరాతకుడిగా జీవించిన వ్యక్తి సప్తర్షుల ప్రభావంతో మహర్షిగా మారి సంస్కృత ఆదికావ్యం రామాయణం నిర్మించిన చరిత్ర ఈ గ్రంథంలో ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్వీయూ సెంట్రల్ లైబ్రరీ డైరెక్టర్ ప్రొఫెసర్ సురేంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మాటికీ అది దుర్మార్గం



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి

తిరుపతి కల్చరల్: అడవుల్లో నక్సల్ ఏరివేత ముమ్మాటికి దుర్మార్గమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. గురువారం తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2026 కల్లా నక్సల్‌ను తుదముట్టిస్తామన్న కేంద్ర హోం మంత్రి వ్యాఖ్యలు గిరిజన ప్రాంత వాసులను భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు. అటవీ ప్రాంతాలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించాలన్న వైఖరితో కేంద్రం కుట్రచేస్తోందని ధ్వజమెత్తారు. పార్లమెంట్ ఉభయసభల్లో వక్ఫ్ బిల్లుపై బుల్డోజ్ చేసి బిల్లు పాస్ చేయించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 22 నుంచి 26వ తేదీ వరకు తిరువనంతపురంలో జాతీయ సమితి సమావేశాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆక్వా రైతులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు.

జాతీయ స్థాయికి 'మినీ ఫాస్ట్ కంపోస్టర్ ప్రాజెక్టు'

- విద్యార్థులను అభినందించిన జేసీ, డీఈఓ



విద్యార్థులు రూపొందించిన మినీ ఫాస్ట్ కంపోస్ట్ ప్రాజెక్టు



విద్యార్థులు, జిల్లా సైన్స్ అధికారి, డీఈఓను అభినందిస్తున్న జేసి శుభం భన్సల్

తిరుపతి ఎడ్యుకేషన్ : కేంద్ర ప్రభుత్వ ఇన్నోవేషన్ సెల్ మంత్రిత్వ శాఖ, అటల్ టింకరింగ్ ల్యాబ్, నీతి ఆయోగ్, జాతీయ సాంకేతిక విద్యామండలి సంయుక్తంగా 2024–25 విద్యాసంవత్సరంలో స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించింది. గత ఏడాది జూలై 29 నుంచి డిసెంబర్ 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాల నుంచి దాదాపు లక్షకు పైగా మోడల్స్‌ను విద్యార్థులు పంపించారు. వీటి నుంచి 1,731 ప్రాజెక్టులు మొదటి దశలో ఎంపికవగా, మన రాష్ట్రం నుంచి 76 ప్రాజెక్టులున్నాయి. అందులో నుంచి తిరుపతి, విజయనగరానికి చెందిన రెండు ప్రాజెక్టులు మాత్రమే ఆర్థిక సాయానికి ఎంపికయ్యాయి. తిరుపతి జిల్లా, వడమాలపేట మండలం, తడుకు ఆర్ఎస్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు హేమశ్రీ, గీతిక, వినయ్‌కుమార్ జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ మార్గనిర్దేశంలో రూపొందించిన మినీ ఫాస్ట్ కంపోస్టర్ ప్రాజెక్టుకు అభివృద్ధికి రూ.90వేలు ఆర్థిక సహకారాన్ని కేంద్ర ప్రభుత్వం అందించింది. ఈ నేపథ్యంలో గురువారం కలెక్టరేట్‌లో ప్రాజెక్టు రూపకర్తలను, సైన్స్ ఆఫీసర్, డీఈఓ కేవీఎస్.కుమార్‌లను జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ అభినందించారు. ఈ ప్రాజెక్టు పనితీరు, ఉపయోగాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న అన్ని వనరులను సద్వినియోగం చేసుకుని సమాజాభివృద్ధికి అవసరమయ్యే ఆవిష్కరణలు చేయాలని జేసీ పిలుపునిచ్చారు.

భారతమ్మపై అనుచిత వ్యాఖ్యలు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు
- చేబ్రోలు కిరణ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్



బుచ్చినాయుడుకండ్రిగలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలపై బుచ్చినాయుడుకండ్రిగ పోలీస్ స్టేషన్‌లో గురువారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు కొణతనేని మణినాయుడు, చిత్తూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనరు వేలూరు రాకేష్ ఫిర్యాదు చేశారు. యూట్యూబర్ చేబ్రోలు కిరణ్‌పై కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి సతీమణి వైఎస్ భారతిరెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిపై టీడీపీ ఆధ్వర్యంలో పనిచేసే ఐటీడీపీ వంటి సంస్థలు అభ్యంతరకరమైన పోస్టింగ్‌లు పెట్టాయని ఆరోపించారు. కొన్నింటిని మార్ఫింగ్ చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని మండిపడ్డారు. సామాజిక మాధ్యమాల ద్వారా ప్రసారం చేయడం వారి గౌరవ ప్రతిష్టలకు భంగం కలుగుతోందన్నారు. పాయింట్ బ్లాక్ అనే యూట్యూబ్‌లో చేబ్రోలు కిరణ్ అభ్యంతకరమైన ఆరోపణలు చేశారని, కిరణ్‌తోపాటు ఇంటర్వ్యూ చేసిన వారిపై కేసు నమోదుచేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు గోపాల్‌రెడ్డి, రవిరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గురునాథం, వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, నాయకులు గురవయ్య, ప్రసాద్‌పాల్, కిరణ్‌యాదవ్, ప్రసాద్, అమరలింగయ్య, వెంకటేష్, రాజశేఖర్, దయాకర్‌రెడ్డి ఉన్నారు.

నేత్రపర్వంగా స్నపన తిరుమంజనం



శేష వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి

రాపూరు: వార్షిక వసంతోత్సవాల్లో భాగంగా పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామికి గురువారం స్నపన తిరుమంజనాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. శ్రీవారికి గ్రీష్మ తాపాన్ని చల్లార్చేందుకు పెంచలకోనలో వసంతోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఉదయం 8 గంటలకు శ్రీవారికల్యాణ మండలపంలో నిత్యహోమం, 10 గంటలకు స్వామి వారి నందనవనంలో శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాలను ఉంచి విశేషంగా అభిషేకించారు. ఉభయకర్తలుగా బండి తిరుపాల్‌రెడ్డి, తేజ దంపతులు వ్యవహరించారు.

శేష వాహనంపై ఊరేగిన నృసింహుడు

గురువారం రాత్రి శేష వాహనంపై నరసింహస్వామి ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

పారిశ్రామికవేత్తలుగా రాణించాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు



ఫ్లాష్ మాబ్‌తో అలరిస్తున్న విద్యార్థినులు

తిరుపతి సిటీ: నూతన ఆవిష్కరణలపై యువత దృష్టి సారించి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని జేఎన్టీయూ వీసీ సుదర్శన్‌రావు పిలుపునిచ్చారు. స్థానిక కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో తరంగ్–2025 పేరుతో గురువారం జరిగిన వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రామన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ లోనూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలోనూ పట్టు సాధించాలన్నారు. కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ సమాజానికి ఉపయుక్తమైన ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టి సారిస్తే చిరస్థాయి గుర్తింపుతోపాటు పది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే స్థాయికి చేరుకుంటారన్నారు. వార్షికోత్సవం సందర్భంగా అకడమిక్ విద్యలోనూ, క్రీడల్లోనూ ప్రతిభ చూపిన విద్యార్థులకు అతిథులు జ్ఞాపికలు, ధ్రువపత్రాలను అందజేశారు. అనంతరం విద్యార్థుల ఫ్లాష్ మాబ్, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాయలసీమ విద్యాసంస్థల డైరెక్టర్ మన్నెం వెంకటరామిరెడ్డి, కళాశాల సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ జయచంద్ర, కన్వీనర్ మునిశంకర్ పాల్గొన్నారు.

వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు



మాట్లాడుతున్న ఏపీ ఎన్నికల కమిషనర్

తిరుపతి అర్బన్: వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, ఆ మేరకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో ఆమె కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులుతో పాటు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖ, పోలీస్ శాఖ అధికారులతో మేథోమథన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం సాహ్నీ మాట్లాడుతూ వచ్చే ఏడాది పంచాయతీ రాజ్, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలన్నారు. ఎన్నికల నిర్వహణకు ఈవీఎంల వినియోగంపై పరిశీలిస్తున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో గూడూరు ఆర్డీవో రాఘవేంద్రమీనా, అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, జిల్లా పంచాయతీ అధికారిని సుశీలాదేవి, తిరుపతి మున్సిపాలిటీ డిప్యూటీ కమిషనర్ అమరయ్య పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల స్కాలర్‌షిప్ కోసం కృషి

- కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖామంత్రి జువల్ ఓరం



వర్సిటీని సందర్శించిన కేంద్ర మంత్రి జువల్ ఓరం

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో విద్యనభ్యసిస్తున్న గిరిజన విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖామంత్రి జువల్ ఓరం హామీ ఇచ్చారు. గురువారం ఆయన జాతీయ సంస్కృత వర్సిటీలో పర్యటించి అధికారులు, గిరిజన విద్యార్థులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సంస్కృత భాషా వ్యాప్తికి వర్సిటీ అధికారులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వర్సిటీ పరిశోధనలు, విద్యాభివృద్ధిలోనూ అగ్రస్థానంలో కొనసాగుతుండటం ప్రశంసనీయమన్నారు. భారతీ సంస్కృతిని కాపాడాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. అనంతరం ఆయన వర్సిటీలోని శ్రీ జగన్నాథ ఆలయాన్ని సందర్శించి ప్రార్థనలు చేశారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఒడిశా చైర్ డైరెక్టర్ డాక్టర్ జ్ఞానరంజన్ పాండా, అధ్యాపకులు, అధికారులు పాల్గొన్నారు.

బాలిక మృతి కేసులో విచారణ వేగవంతం

- దహనం చేసిన ప్రాంతాన్ని పరిశీలించిన పోలీస్, రెవన్యూ అధికారులు
- ల్యాబ్ పరీక్షల కోసం అస్థికలు సేకరించిన క్లూస్ టీం



అస్థికలను సేకరిస్తున్న క్లూస్ టీం

చంద్రగిరి: బాలిక అనుమానాస్పద మృతిపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. నరసింగాపురం సమీపంలోని స్వర్ణముఖి వాగులో బాలికను దహనం చేసిన ప్రాంతాన్ని గురువారం సీఐ సుబ్బరామిరెడ్డి, తహసీల్దార్ శివరామసుబ్బయ్యలతో కలసి క్లూస్ టీం అధికారులు పరిశీలించారు. అనంతరం బాలిక అస్థికలను సేకరించారు. ఆ తర్వాత పోలీసు, రెవెన్యూ అధికారులు నరసింగాపురంలోని మృతురాలి ఇంటి వద్దకు వెళ్లి బాలిక తండ్రితో పాటు చుట్టుపక్కల వారిని విచారణ చేశారు. తన కుమార్తెను తల్లే పొట్టన పెట్టుకుందని మృతురాలి తండ్రి పోలీసుల ఎదుట కన్నీటి పర్యంతమైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఇదిలా ఉంచితే, మైనర్ బాలిక తల్లిని పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

తిరుమలకు వెళ్లిన పోలీసులు

బాలిక మృతి చెందిన రోజు తాను ఇక్కడ లేనని, తిరుమలలో విధుల్లో ఉన్నట్లు ఆమె తల్లి పోలీసులకు చెప్పినట్లు సమాచారం. పోలీసులు గురువారం మధ్యాహ్నం తిరుమలకు వెళ్లినట్లు తెలిసింది. బాలిక తల్లి పనిచేస్తున్న ప్రాంతానికి వెళ్లిన పోలీసులు ఆమె సహద్యోగులను విచారణ చేసినట్లు సమాచారం.